కథ

# అమ్మెందుకు ఆశ్రమంలో ఉంది?

**"బావగారు కూడా వచ్చుంటే బాగుండేది అక్కయ్యా!" అంటూ సులోచన చేతిలోంచి బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు సురేష్.**

**"వద్దామనే అనుకున్నారు. కానీ లాస్ట్ మినిట్‌లో కాలిఫోర్నియాలో వాళ్ళ ఎమ్.డి. అర్జంటు పనుందంటూ ఆగిపొమ్మన్నారు. వర్క్ అంటే వర్షిప్ కదా మీ బావగార్కి!"**

సురేష్ వెంట ఏర్‌పోర్ట్‌లోంచి బయటికి నడిచింది సులోచన. డిక్కీలో లగేజ్ సర్ది, కారు స్టార్ట్ చేసాడు సురేష్.

"అక్కయ్యా! పిల్లలిద్దర్కీ పరీక్షలని రాసావ్! వినయ్, సుమా బాగా ప్రిపేర్ అవుతున్నారు కదూ?" అన్నాడు సురేష్.

"ఊ..అమెరికా చదువులు. నీకు తెలీందేముంది సురేష్! ఎంత శ్రమిస్తే అంత ఫలితం" అంది సులోచన.

సిగ్నల్ పడడంతో-కారు క్రాస్‌రోడ్స్ వద్ద ఆగిపోయింది.

"మనమిప్పుడు వెళ్తున్నది అమ్మ దగ్గరికే కద సురేష్!" అంది సులోచన.

"ఊహూ! ఇప్పుడయితే మన ఫ్లాట్‌కి-నువ్వీపూట కాస్త రెస్ట్ తీస్కో అక్కయ్యా! నాక్కూడా ఆఫీసులో అర్జంట్ మీటింగుంది. కుసుమకి అనుకోకుండా హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ వర్క్ వచ్చి పడిందీపూట. నీకు తెలీదేమో ఈమధ్య మా రాష్ట్రమంత్రులు 'సర్‌ప్రైజ్ చెక్స్' అంటూ ఉద్యోగులందర్నీ భలే హడల్ కొట్టిస్తున్నారులే!"

పోర్టికోలోకి దూసుకు వచ్చిన మారుతి ఆగీఆగడంతో కారు వద్దకు పరుగున వచ్చిన కుసుమ "బాగున్నారా-వదినా?" అంది చిరునవ్వుతో.

"ఆ.. బాగానే వున్నాను" ఒకింత ముభావంగా బదులిస్తూ, లిఫ్ట్ దగ్గరికి నడిచింది సులోచన.

అపార్ట్‌మెంట్స్ వాచ్‌మన్ లగేజ్ తెచ్చి లిఫ్ట్‌లో పెట్టాడు.

"కుసుమా! అక్కయ్యకి కాఫీ ఇవ్వు. నేనింతలో స్నానం చేసి వస్తాను" అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు సురేష్.

తన సూట్‌కేసూ బ్యాగ్ వుంచిన గదిని పరికించి చూసింది సులోచన.

సురేష్ త్రీబెడ్ రూం ఫ్లాట్ కొనుక్కుని అందులోకి షిఫ్ట్ అయ్యాక, ఇండియా రావడం సులోచనకి ఇదే మొదటి సారి.

బాగ్ పెడ్దామని కాబినెట్ తలుపు తెరిచింది సులోచన. పై అరలో లామినేట్ చేసిన అమ్మా నాన్నల ఫోటో కనపడింది. కింది అరల్లో అమ్మ చీరలు కాబోలు అన్నీ నీట్‌గా సర్దబడివున్నాయ్. ఒక పక్క, చక్కగా ఇస్త్రీ చేసిన దిండు గలీబులు, బెడ్‌షీట్లు, తువ్వాళ్ళు 'అబ్బ! ఎంత నీట్‌గా అరేంజ్ చేసుకుంది, అమ్మ తన బట్టల్ని' అనుకుంటూ, తన బ్రీఫ్ కేసులోంచి బట్టల్ని బయటకి తీసి ఖాళీగా వున్న కేబినెట్ అరలో వుంచి, ఫ్రెష్ అప్ అయ్యేందుకు అటాచ్డ్ బాత్‌రూంకేసి నడిచింది సులోచన.

"వదినా! కాఫీ" అంటూ కాఫీ గ్లాసు అందించింది కుసుమ.

"అన్నట్లు కుసుమా! పిల్లలేరీ-కన్పించరే? ఇంత ప్రొద్దుటే స్కూళ్ళ కెళ్ళిపోయారా!"

"ఏంటొదినా స్కూలంటున్నారు! ఇద్దరూ కాలేజీకొస్తే.."

"సారీ! మర్చిపోయాను" అపాలిజిటిక్‌గా నవ్వింది సులోచన.

"రతి ఇప్పుటు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో వుంది. ప్రొద్దుటే 7.30కి దానికి మార్నింగ్ క్లాసస్ మొదలవుతాయ్. రాహుల్ మెడిసన్ ఫస్ట్ ఇయర్.

కాలేజీకి ఇల్లు దూరం అంటూ వాడిప్పుడు హాస్టల్లో వుంటున్నాడు"

అప్పటికే తయారైవచ్చిన కుసుమ, హాస్పిటల్‌కి వెళ్ళే తొందరలో వున్నట్లు గ్రహించింది సులోచన.

"కుసుమా! నీకు హాస్పిటల్‌కి టైమయినట్లుంది కదా!"

"ఔనొదినా! ఈరోజు నాకు ఓ.టీ వుంది. టిఫిన్ టేబిల్ మీద రెడీ చేసాను. వంట కూడా పూర్తయింది. రైస్ కుక్కర్‌లో-మీకు మాత్రం-రైస్ పెట్టాను. భోంచేయాలనుకున్నప్పుడు వేడివేడిగా వడ్డించుకోండి. సరేనా!" హ్యాండ్ బాగ్ అందుకుంటూ "సురేష్! మీకు ఆఫీసు కారొస్తుందిగా! నేను ఈ కారు తీసికెళ్తాను. వదినా! బై." ఏప్రాన్ భుజాన వేసుకుని స్టెత్ చేత పట్టుకొని కారుకేసి నడిచింది కుసుమ.

డైనింగ్ టేబిల్ దగ్గర హడావిడిగా ఇడ్లీలు ఆరగిస్తూ కూర్చున్న సురేష్, తన వంక తదేకంగా చూస్తున్న అక్కని చూసి ఒకింత అవాక్కయ్యాడు.

"ఏంటక్కయ్యా! అలా చూస్తున్నావ్" అన్నాడు సురేష్ మంచినీళ్ళ గ్లాసు అందుకుంటూ.

"మీరింత స్థిమితంగా ఏమీ జరగనట్లు ఎలా వుండగల్గుతున్నారా?" అంది సులోచన కంఠంలో కోపాన్ని పలికిస్తూ.

అసలు విషయానికి- అక్క అప్పుడే వచ్చేస్తోందని గ్రహించాడు, సురేష్.

"చెప్పాను కద అక్కయ్యా! ఆఫీసులో నాకీపూట అర్జంట్ మీటింగుంది. సర్దుకోవల్సిన రిపోర్ట్స్, పేపర్స్ చాలా వున్నాయ్. నీతో తీరిగ్గా మాట్లాడే టైం లేదు నాకు. సాయంత్రం ఆఫీసు నుండి తిరిగొచ్చాక సంజాయిషీలు సమర్పించుకుంటాను. అవి కన్విన్సింగ్‌గా లేకపోతే నన్ను ఛార్జ్‌షీట్ చేద్దువు కానీలే!" టేబిల్ వద్ద నించి లేచిపోయాడు సురేష్.

"అదొక్కటే తక్కువయింది! మాటలెందుక్కానీ సురేష్ సాయంత్రం నన్ను తీస్కెళ్ళి అమ్మవున్న ఓల్డేజ్ హోమ్‌లో దింపు. నేనిక్కడుండే నాల్రోజులైనా అమ్మతో గడిపిన తృప్తి మిగులుతుంది నాకు. అలా కుదరని పక్షంలో అమ్మనే ఏదో హోటలికి తీస్కెళ్ళి నేనిక్కడ వున్నన్ని రోజులూ నాతో వుంచుకుంటాను."

"ఓకే.. ఓకే.. అక్కయ్యా! నువ్వెలా అంటే అలా చేద్దాం. యువర్-విల్ అండ్ ప్లెజర్"

ఇంతలో ఆఫీసు కారు రావడంతో బ్రీఫ్‌కేసు పట్టుకొని బయటకు నడిచాడు సురేష్.

కాఫీ సిప్‌చేస్తూ ముందు గదిలోకి వచ్చింది సులోచన. కార్నర్ పీస్ మీద ఓ టెలిఫోనూ- దాని పక్కనే టెలిఫోన్ ఇండెక్సూ కంటపడడంతో ఆ పక్కనే వున్న కుర్చీలో కూచుని ఇండెక్స్‌లోని పేజీలు అటూ-ఇటూ తిప్పసాగింది సులోచన. ఎర్రసిరాతో అండర్‌లైన్ చేసిన 'రాధానంద ఆశ్రమం' అన్న పేరు చదివి, 'ఓహో! అమ్మ వుంటున్న వృద్ధాశ్రమం ఇదే కాబోలు- రింగ్‌చేసి అమ్మను పల్కరిస్తే' అనుకుని ఒక్క క్షణం వృద్ధాశ్రమం నంబరు వంక చూస్తూ 'సాయంత్రం ఎటూ అటే వెళ్తున్నాంగా' అనుకుని ఫోన్ చేసే ప్రయత్నాన్ని విరమించుకొని లోనికి వెళ్ళిపోయింది సులోచన.


బాంబే హైవే మీద వేగంగా దూసుకుపోతోంది కారు. ఏదో పనుందంటూ ఇంటి పట్టునే వుండిపోయింది కుసుమ. అక్కా తమ్ముళిద్దరే బయలుదేరారు ఆశ్రమానికి. కొంతసేపు మౌనం నివాసం చేసింది కార్లో.

"సురేష్! నిజం చెప్పు! నీకు అమ్మ-ఒక్కతి-అంత బరువైపోయిందా? పోనీ- అలా అనుకున్న వాడివి నాకో-ఇ-మెయిలో, ఫోనో చేస్తే వచ్చి అమ్మను నాతో అమెరికా తీస్కెళ్ళే ఏర్పాటు చేసుకొనేదాన్నిగా! అలా దిక్కులేని దాన్లా ఎక్కడో ఆశ్రమంలో చేర్చడానికి నీకు మనసెలా వచ్చిందిరా?" సులోచన గొంతు గద్గదికం అవడం గమనించాడు సురేష్.

"అక్కయ్యా! అను. ఇంకా ఎన్నెన్ని మాటలనాలో అన్నీ అను. ఇలాంటి మాటలు విని విని బండబారిపోయాను నేను. నువ్వే కాదు ఎందరో ఎన్ని మార్లో నన్ను నిందించారు. నిలదీశారు. ప్రశ్నించారు. బాబాయ్-అయితే ఒక మెట్టు పైకెళ్ళి, తిట్టిన తిట్టు తిట్టకుండా దూషించాడు. ఈ ప్రశ్నలకీ ఆరోపణలకీ నా వద్ద జవాబు లేదు. ఎందుకంటే నాకే తెలీదు కాబట్టి! నువ్వు నమ్మినా, నమ్మకపోయినా అమ్మ తీసుకున్న ఆ నిర్ణయానికి అసలు కారణం నాకింతవరకు తెలీదు" బాధగా అన్నాడు సురేష్.

విస్మయంగా చూసింది తమ్ముడికేసి సులోచన.

"పోనీ-అమ్మని నువ్వు వెళ్ళొద్దని చెప్పకపోయావా?




ఆవిడ్ని ఆపలేకపోయావా?"

"అక్కయ్యా! అమ్మ తన నిర్ణయం, వెళ్ళడం ఖరారు చేసుకున్నాకే నాతో ఆ విషయం చెప్పింది. హడావిడి పడి నీకా విషయం ఫోన్ ద్వారా కానీ, మెయిల్ చేసి కానీ చెప్పొద్దంది అమ్మ. అలా అని నా దగ్గర ప్రామిస్ తీస్కుంది. అమ్మ నిర్ణయమేమోకానీ నేను మాత్రం మీ అందరి ముందు దోషిలా నిలబడిపోయాను. ఇక కుసుమ- సరేసరి. అందునా కోడలు కదా! అత్తని ఇంట్లోంచి తరిమేసిందన్న నిందని భరిస్తూ చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తోంది" సురేష్ మాటలకు విచతు రాలయింది సులోచన.

హారన్ శబ్దానికి గేటు వద్ద నున్న వాచ్‌మన్ పరుగున వచ్చి సురేష్‌ని గుర్తుపట్టి సెల్యూట్ కొట్టి గేటు తెరిచాడు.

పచ్చని చెట్లతో నిండివున్న సువిశాల ఆవరణలో అక్కడో భవనం-ఇక్కడో కాటేజీ. ఆవరణ చుట్టూతా ఎత్తయిన ప్రహరీగోడ. నెమ్మదిగా వెళుతూన్న కార్లోంచి అటూ-ఇటూ చూస్తూ కూచుంది సులోచన. కారు తిన్నగా వెళ్ళి అధునాతనంగా వున్న ఓ భవంతి ముందు ఆగిపోయింది. కార్లోంచి సురేష్, సులోచనా దిగి ఓ ప్రక్కగా నిలబడ్డాడు.

"అక్కయ్యా! అటు చూడు-అమ్మ! ప్రార్థన ముగించుకొని మెట్లు దిగి వస్తోంది. ఈ ప్రార్థనా మందిరాన్ని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నెలక్రితం ప్రారంభించారు. అమ్మ వుంటున్న కాటేజ్- అదిగో..అదే.." వంద గజాల దూరంలో వున్న ఓ పెంకుటిల్లు చూపిస్తూ అన్నాడు సురేష్.

ప్రశాంతంగా కూతురుకేసి నడిచి వస్తూ "అమ్మా సులోచనా! బాగున్నావామ్మా? ఎప్పుడొచ్చావ్ అమెరికా నుండి? అల్లుడుగారు, పిల్లలూ క్షేమమే కదా?" ఆప్యాయంగా కూతుర్ని దగ్గరికి తీస్కుంది సరస్వతమ్మ.

ఆ పక్కనే వున్న కొడుకు వంక చూస్తూ "సూరీ! ఇంత దూరం వస్తున్నావు కద నాన్నా! రతిని, రాహుల్‌ని తీసుకు రాలేకపోయావా?" అంది సరస్వతమ్మ.

"పోయిన ఆదివారమే కదమ్మా అందరం వచ్చాము. మళ్ళీ నువ్వే అంటావ్- 'చదువుకొనే వాళ్ళని ఎందుకురా

ఎమ్.హేమలత

అటూ-ఇటూ తిప్పుతావు' అని"

"రండి..రండి కాటేజీకి వెళ్దాం" అంది సరస్వతమ్మ.

కూతురు వెంట రాగా కాటేజికేసి నడిచింది సరస్వతమ్మ. సురేష్ కారెక్కి వాళ్ళని ఫాలో అయ్యాడు.

"విశాలామ్మా! ఇదిగో మా అమ్మాయి సులోచన-స్టేట్స్‌లో వుందని చెబుతుంటానే!" వరండాలో కూచుని పువ్వుల్ని మాలగా కడుతున్న ఆవిడకి పరిచయం చేసింది కూతుర్ని.

"మేమిద్దరం ఈ టూ బెడ్ రూం కాటేజ్ షేర్ చేస్తున్నామమ్మా" అంది సరస్వతమ్మ సులోచనతో.

"రామ్మా! కూచో. పూజవేళ కావస్తోంది. పూలమాలను ఇచ్చేసి వస్తాను. అన్నట్లు సరస్వతమ్మా! డికాక్షన్ రెడీగా వుంది. ఫిల్టర్ కాఫీ అంటే మీ అబ్బాయికి ప్రాణం అంటుంటారు కదా! అలాగే అమ్మాయికి కూడా కాఫీ కలిపి ఇవ్వండి" అని బయటికి నడిచింది విశాలమ్మ.

"అమ్మా! కాఫీ తర్వాత, ముందు నాకీ సంగతి చెప్పు. సురేష్ ఒక్కడేనా నీ కొడుకు! నేనేం కానా నీకు! అన్నీ వదులుకొని ఇలా ఆశ్రమంలో చేరబోయే ముందు ఒక్క

మాట- నాక్కానీ, మీ అల్లుడికి కానీ చెప్పాలని నీకు అన్పించలేదా? లేక చెప్పాల్సిన అవసరం లేదని మిన్నకున్నావా?"

సులోచన ఆవేశానికి ఫక్కున నవ్వింది సరస్వతమ్మ.

"సులో! నీకు వయసు వచ్చిందే కానీ చిన్నతనం మాత్రం ఇంకా పోలేదు. ముందిలా కూచో, సావకాశంగా మాట్లాడుకుందాం. అటు సురేష్ చూడు ఎంత చిన్నబుచ్చుకున్నాడో. నువ్వు ఇండియా వస్తున్నట్లు సురేష్ చెప్పగానే అనుకున్నాను-నువ్వేదో కయ్యం తెస్తావని."

కయ్యం అన్న మాటకి మరింత ఉడుక్కున్న సులోచన సమాధానం చెప్పేలోగా సరస్వతమ్మ లోపలికెళ్ళిపోయింది నవ్వుకుంటూ.

ముఖం గంటుపెట్టుకొని కూచున్న అక్కయ్య వంక చూడలేక, అక్కడే టేబిల్ మీదున్న పేపరందుకున్నాడు సురేష్.

"అమ్మా! ఎన్నాళ్ళకి తాగాను నీ చేతి కాఫీ. నేనెంత బాగా చేసినా కాఫీకి ఈ రుచి రాదు సుమా!" వెచ్చటి కాఫీకి కొంత చల్లబడింది సులోచన. కూతురి పక్కన కూచున్న సరస్వతమ్మ, ఆప్యాయంగా సులోచన చేతిని పట్టుకుంది.

"సులో! పిల్లలెలాగున్నారమా! వాళ్ళ చదువుల సంగతి అడగక్కరలేదనుకో! ఈ అమ్మమ్మ మనవలేగా వాళ్ళు. నా పేరు నిలబెడ్తారు."

అమ్మ ఛలోక్తికి తల్లికేసి ప్రసన్నంగా చూసింది సులోచన.

"అమ్మా! నువ్వు మాట దాటేస్తున్నావ్. అసలు నువ్వు ఇక్కడెందుకున్నావ్? సురేష్‌ని అడిగితే నాకేమీ తెలీదంటున్నాడు. నీకంత కష్టమేమొచ్చింది చెప్పు" అంది కోపంగా సులోచన.

అక్కయ్య మాటలు ఇంకా ఏమేమి వినాల్సి వస్తుందో-ఎందుకొచ్చిన గొడవ అనుకున్న సురేష్ "అమ్మా! నేను రాఘవాచారిగార్ని ఒక్కమారు కల్సి రానా?" అంటూ బయటికి వెళ్ళాడు.

ఎవరీ రాఘవాచారి అన్నట్లు చూస్తున్న కూతురితో-"ఈ ఆశ్రమ వ్యవస్థాపకులు అమ్మా-రాఘవాచారిగారంటే" అంది సరస్వతమ్మ.

"అమ్మా! నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు నువ్వు!" రెట్టించింది సులోచన.

"ఏం చెప్పమంటావు సులో! కొడుకూ-కోడలు రాచి రంపాన పెడుతున్నారు. మనవలిద్దరూ నన్నేమాత్రం లెక్క చేయడం లేదు. ఆ నరకం భరించలేక తప్పించుకొని ఇక్కడికి వచ్చి వాలానని చెప్పమంటావా? ఆ... ఆగు. అంత ఉద్రేకపడకు. అవేమీ నిజం కాదమ్మా! నేను అభిలషించదగ్గ అనురాగం, ఆప్యాయత, ప్రేమ, గౌరవం ఇప్పటికీ, ఎప్పటికీ నాకు లభ్యమౌతూనే వున్నాయి నా కొడుకూ, కోడలూ, మనవల నుంచి. అది నా కుటుంబం కదమ్మా! వాళ్ళ కష్టసుఖాల్లో పాలుపంచుకోవల్సిన దాన్ని! వాళ్ళమీద అలిగి రావడానికి నేనేం పరాయిదాన్నా?!"

"మరయితే..ఇలా..ఇక్కడికి..."

"అదే చెప్తున్నాను విను. మీ నాన్నగారూ నేనూ సురేషూ కుసుమ, పిల్లలూ కలిసి సంతోషంగా గడిపాం. పిల్లల సంరక్షణా, వారి బాగోగులు అన్నీ మావే! కుసుమా, సురేషులిద్దరూ ఉద్యోగస్థులవడంతో ఒక విధంగా వాళ్ళు మా మీద ఆధారపడి బ్రతికేవారు. సరే రోజులు ఎప్పుడూ ఒక్కలా వుండవు కదా! కాలంచెల్లి మీ నాన్నగారు కాలగర్భంలో కలిసిపోయారు. ఆయన వెళ్ళిపోవడంతో నేను ఒంటరిదాన్నయిపోయాయన్న భావన నాలో చోటు చేసుకుంది. అది సహజమే కదా! కానీ పిల్లల సమక్షంలో ఆ బాధని కూడా మర్చిపోయేందుకు ప్రయత్నించాను. ఇప్పుడు పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయిపోయారు. వాళ్ళ ప్రపంచం వాళ్ళ చదువులు. నా అక్కర అవసరం వారికిక లేదు. సురేష్ కుసుమ ఎవరి పనుల మీద వాళ్ళు వెళ్ళిపోవడంతో చేతినిండా పనిలేకపోవడంతో నాలో ఎనలేని శూన్యం చోటు చేసుకుంది"

"అబ్బ! అమ్మా! నీదంతా చాదస్తం. హాయిగా విశ్రాంతి తీస్కోవలసిన ఈ వయసులో నీకిదేం పిచ్చి"

"హలో! నువ్విలా అంటావనే అనుకున్నాను. నేనూ మీ నాన్నగారు ఇద్దరం ఉద్యోగస్థులమన్న విషయం నీకు తెల్సు కదా! నేను స్కూలు టీచర్ని. ఆయనో ఉన్నతోద్యోగి. ఎంతో బిజీగా ఒక్క క్షణం తీరికలేకుండా గడిచిన జీవితాలు మావి. సరే మీ చదువులు.. చదువయ్యాక నీ పెళ్లి. ఆ తర్వాత సురేష్ పెళ్లి. కొన్నాళ్ళకి అల్లుడుగారు, నువ్వూ మీ పిల్లలిద్దర్నీ మా వద్ద వదిలి అమెరికాకు వెళ్లిపోయారు. చంటి పిల్లల ఆలనాపాలనా మా మీద పడింది. మీరు కాస్త సెటిలయ్యాక ఇండియావచ్చి పిల్లల్ని మీతో తీసుకెళ్లిపోయారు. ఆ పిమ్మట సురేష్ పిల్లల బాధ్యత.. వాళ్ళ చదువులతో సమయం ఎలా గడిచిపోయిందో, అసలు తెలిసేది కాదు. 'అబ్బ కొంచెం రెస్టు వుంటే ఎంత బాగుణ్ణు!' అని అనుకున్న క్షణాలు కూడా లేకపోలేదు. ఆ అభిలషించిన విశ్రాంతే నాకిప్పుడు లభించింది. ఆ విశ్రాంతే పెనుభూతంలా వచ్చి నన్ను చుట్టుకుంది. ఇంట్లో ఎవరూ లేక- చేయడానికి చేతినిండా పనిలేక- ఈ జీవితమెందుకు అన్న నిర్లిప్తత, స్తబ్దత నాలో నిక్షిప్తమయి ఇది అని చెప్పలేని డిప్రెషన్‌లోకి జారుకున్నాను"

"అలా ఎందుకనుకోవాలమ్మా! హాయిగా నాతో రా అమెరికాకి. అక్కడ నీకు కావాల్సినంత పనీ- కాలక్షేపం"

"నీతో అమెరికాకి రమ్మంటున్నావ్! చాలా బాగుందమ్మా. కార్లే తప్ప మనుషులే కన్పించని అక్కడికొచ్చి మాత్రం నేను చేసేదేముంది. అదలా వుంచు. అసలు విషయం నన్ను చెప్పనివ్వు. ఇలా అశాంతితో, ఎటూ తేచని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న నేను ఈ రాధానంద ఆశ్రమాన్ని గురించి ఓ దినపత్రికలో చదివాను. ఎందుకో వాళ్ళ ఆశయాలు, ఆశ్రమం నడిపే తీరు నాకు నచ్చింది. వాళ్లని కలిసి మాట్లాడాక నాకు కావల్సిందేదో నాకు దొరికినట్లనిపించింది.

చిన్నతనంలో తల్లితండ్రుల చాటున పెరుగుతాం మనం. పెళ్లిచేసుకుని, వుద్యోగాల్లో పడ్డాక, సంసారసాగరంలో మునిగిపోతాం. సరే పిల్లలూ వారి బాధ్యత, తర్వాత పిల్లల పిల్లల బాధ్యత- ఇలా ఎప్పుడూ స్వార్థపూరితమైన బాధ్యతలే మనల్ని పట్టిపీడిస్తున్నాయి. ఇందులోంచి తప్పించుకుని బయటికి వచ్చి నిస్వార్థంగా ఏదయినా చెయ్యాలన్న సంకల్పం రాధానంద ఆశ్రమం చూసాక నాకు కలిగింది. మన అవసరం వున్న అభాగ్యులకి, అనాథలకి ఎంతో కొంత సాయపడాలన్న కోర్కె నన్నిక్కడికి లాక్కొచ్చింది.

ఇదొక వృద్ధాశ్రమం మాత్రమే కాదు. ఈ ఆశ్రమంతో ముడిపడి వుందో అనాథ బాలబాలికల గృహం. మానసిక రోగాలతో, వైకల్యాలతో బాధపడే చిన్నారులెందరో మన స్నేహహస్తం కోసం, మన ఆలంబన కోసం ఎదురుచూస్తున్నారు.

చదువుకున్న నాలాంటి బాదరాబందీలేని స్వచ్ఛంద సేవకుల ఆసరా వాళ్లకు కావాలి. నీకు తెలీదమ్మా! మన వారికి మనం చేయడంలో వున్న తృప్తికన్నా, మనకోసం ఆతురతతో, ప్రేమతో పరితపించే నిర్భాగ్యులకు సేవచేయడంలో లభించే తృప్తి, మానసికానందం అనిర్వచనీయం.

అది సరే కాని, సులో- నీకో విషయం చెప్పనా! నా సంతోషం కోసం నేనిలా వచ్చానే కానీ నన్నెవరు ఇక్కడికి బలవంతంగా నెట్టలేదు.

ఈ ఆశ్రమానికి పంపక ఆపి వుంటే నేను బాధపడేదాన్నేమో! అర్థమయింది కదా నేనెందుకు ఈ ఆశ్రమవాసినయ్యానో? అదిగో సురేష్ వస్తున్నాడు. వాడి మీద నిందారోపణలు ఇక కురిపించవనుకుంటాను. ఈ పూట అమ్మచేతి వంట తిందువు కానీ- పద లోపలికి వెళ్దాం" అంది సరస్వతమ్మ.

అమ్మ మాటల్లోని ఔచిత్యాన్ని వెదికి పట్టుకొనేందుకు ప్రయత్నిస్తూ సరస్వతమ్మని అనుసరించింది సులోచన.

